నిధులు స్వాహా చేసిన వారిని వదిలే ప్రసక్తేలేదు

- జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి

రుద్రారం గ్రామపంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, నవంబర్ 3 : నవాబ్‌పేట మండలంలోని గ్రామ పంచాయతీ పారిశుధ్య నిధులను స్వాహా చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని జడ్చర్ల ఎమ్మెల్యే అనురుధ్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. రుద్రారం నిర్మించిన గ్రామపంచాయతీ నూతన భవన ప్రారంభోత్సవం, తూక్యతండాలో హనుమాన్ ఆలయ నిర్మాణానికి భూమిపూజ, కొల్లూరులో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం రుద్రారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.300 బ్లీచింగ్ పౌడర్ బస్తాకు రూ.1300 ధర వేసి, నకిలీ బిల్లులు సృష్టించి డబ్బులు స్వాహా చేశారని తెలిపారు. ఈ అవినీతి నవాబ్‌పేట మండలంలోనే జరిగిందా.. లేక జిల్లా మొత్తం జరిగిందా అనేది విచారణ తర్వాత తెలుస్తుందన్నారు. త్వరలోనే పారిశుధ్యం నిధుల దుర్వినియోగంపై కలెక్టర్ విచారణ చేపడ తాలన్నారు. మండల కేంద్రం నుంచి దొండ్లపల్లి వరకు, యన్మన్‌గండ్ల గేట్ నుంచి పోలేపల్లి ఫార్మా సెజ్ వరకు, రుద్రారం నుంచి మల్లారెడ్డిపల్లి వరకు రెండు లేన్ల బీటీ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయించానని, త్వరలో పనులు ప్రారంభిస్తామని వివరించారు. నవాబ్‌పేటలో మినీ స్టేడియం ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలాగే యన్మన్‌గండ్ల, లోకిరేవు పెద్ద చెరువులను మినీ ట్యాంక్‌బండ్‌గా ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో జయరామ్‌నాయక్, సింగిల్‌విండో చైర్మన్ నర్సింహులు, సింగిల్‌విండో డైరెక్టర్లు ప్రతాప్, నాగ అంజయ్య, వెంకటేశ్, శశిధర్‌రెడ్డి, నాయకులు హరలింగం, వెంకటేశ్‌గౌడ్, వాసుయాదవ్, రాంచంద్రయ్య, భూపాల్‌రెడ్డి, ఖాజా, కోట్ల రాజేశ్, కృష్ణగౌడ్, శంకర్‌నాయక్, నీల్యానాయక్, సంతోష్‌నాయక్, రవీందర్ గౌడ్ రవి, అశోక్, గొల్ల వెంకటేశ్, చిరంజీవి, మైనొద్దీన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

- ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

ముచ్చింతలలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

దేవరకద్ర రూరల్ (కౌకుంట్ల,అడ్డాకుల), నవంబర్ 3 : ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టనున్నట్లు దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం కౌకుంట్ల మండలం ముచ్చింతలలో సహకార సంఘం ఆధ్వర్యంలో, అలాగే అడ్డాకుల మండల కేంద్రంతోపాటు, పొన్నకల్, రాచాల గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం అడ్డాకుల మండలంలోని ఎస్ఎస్‌వీ కాటన్ మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో రాచాల చెరువులో చేప పిల్లలను విడుదల చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నాగార్జునరెడ్డి, మాజీ పీఏసీఎస్ చైర్మన్ ఉమామహేశ్వర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షుడు నాగిరెడ్డి, మండలాధ్యక్షుడు శ్రీహరి, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ పోటీలు ప్రారంభం..

గ్రామీణ క్రీడాకారుల్లో ప్రతిభను వెలికి తీసేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల మండలం రాచాలలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలికలు, అండర్-19 బాలుర రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించి మాట్లాడారు. క్రీడలకు ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదన్నారు. క్రీడలకు రూ.364కోట్ల నిధులను కేటాయిస్తూ, జిల్లాలో స్పోర్ట్స్ యూనివర్సిటీని నెలకొల్పేలా ప్రణాళికలు సిద్ధం చేశారన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

చిన్నచింతకుంట, నవంబర్ 3 : ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని దమగ్నాపూర్, పర్దీపురం గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 3 : రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని పీయూ విద్యార్థి జేఏసీ చైర్మన్ బత్తినిరాము డిమాండ్ చేశారు. ఆదివారం పీయూ పీజీ కళాశాల వద్ద విద్యార్థి సంఘాల నాయకులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బత్తిని రాము మాట్లాడుతూ నిధులు విడుదల కాక పోవడంతో విద్యార్థులు అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. కళాశాలల యాజమాన్యాలు పూర్తి స్థాయి ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల తోనే సర్టిఫికెట్స్ ఇస్తామని లేదంటే విద్యార్థులు ఫీజు చెల్లించి సర్టిఫికెట్స్ తీసుకు వెళ్లాలని షరతులు పెడుతున్నారన్నారు. ప్రచారాల కోసం ప్రభుత్వం కోట్లల్లో ఖర్చు చేస్తోందని, విద్యార్థులకు ఇవ్వడానికి మనసు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. తక్షణమే స్పందించి బకాయి నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ పీయూ అధ్యక్షుడు గణేశ్, శ్రీను మాదిగ, ఏఏసీ నాయకులు వెంకట్, హరిచంద్ర, భాస్కర్, అజీమ్ పాల్గొన్నారు.

ఘనంగా రంగోత్సవం

- 1,600 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు హాజరు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 3 : చిన్నారుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీయడం.. చదువుతోపాటు సమాజ హితంపై అవగాహన కల్పించడం.. ప్రకృతి, పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా.. జిల్లా కేంద్రంలోని రెయిన్‌బో ఉన్నత పాఠశాలలో ఆదివారం రెయిన్‌బో రంగోత్సవం-2024 పోటీలు నిర్వహించారు. న్యాయవాది బెక్కం జనార్దన్, ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్ జ్యోతిప్రజ్వలన చేసి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1,600 మంది ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు పోటీల్లో పాలు పంచుకున్నారన్నారు. జూనియర్స్ కేటగిరీలో 'నేచర్ బ్యూటీ అవర్ రెస్పాన్సిబిలిటీ' అంశంపై 900 మంది.., సీనియర్ కేటగిరీలో 'రెడ్యూస్ రీయూజ్, రీసైకిల్, రీస్టోర్' అంశాలపై నిర్వహించిన చిత్రలేఖనం పోటీలకు 700 మంది హాజరయ్యారు. బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14వ తేదీన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మధుసూదన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ మమత, వైస్ ప్రిన్సిపాల్ సురేశ్ కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలోనే ఆలయాలకు పూర్వవైభవం

- మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

పూజలు చేస్తున్న మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి, అభిమన్యురెడ్డి

నవాబ్‌పేట, నవంబర్ 3 : కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ఆలయాలకు పూర్వవైభవం వచ్చిందని మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామ పంచాయతీ మదిర తూక్యతండాలో నిర్మించతలపెట్టిన హనుమాన్ దేవాలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బీఆర్ఎస్ యువ నేత అభిమన్యురెడ్డితో కలిసి భూమిపూజలో పాల్గొని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో నాటి సీఎం కేసీఆర్ ధూప దీప నైవేద్యం పథకం కింద దేవాయలను ఆధునీకరించరన్నారు. తూక్యతండాలో నిర్మించనున్న ఆలయానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.10లక్షలు మంజూరు చేసిందన్నారు. తూక్యతండాలోని గుట్టపై ఆలయ నిర్మాణానికి పూనుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం యువ నేత అభిమన్యురెడ్డి మాట్లాడుతూ తండాలో హనుమాన్ ఆలయం నిర్మించడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం మాజీ ఎంపీ శ్రీనివాస్‌రెడ్డి తోపాటు యువ నేత అభిమన్యురెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమం లో సింగిల్‌విండో చైర్మన్ నర్సిములు, మాజీ జెడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శీనయ్య, నాయకులు ప్రతాప్, చెన్నయ్య, సంతోష్‌రెడ్డి, శ్రీను, నాయకులు శేఖర్‌రెడ్డి, హన్మంతు, లక్ష్మయ్య, రఘువీర్, రాంచందర్, సంతోష్ పాల్గొన్నారు.

స్థాయికి తగినట్లు మాట్లాడాలి

- నీ నేరచరిత్రను మసీదుల వద్ద అతికిస్తాం
- సిరాజ్‌ఖాద్రీపై బీఆర్ఎస్ నేత ఇమ్రాన్ మండిపాటు

సమావేశంలో మాట్లాడుతున్న మైనార్టీ నాయకులు

మహబూబ్‌నగర్ అర్బన్, నవంబర్ 3 : 'నీ స్థాయికి తగినట్లు మాట్లాడు.. మహబూబ్‌నగర్‌ను అభివృద్ధి పథంలో నిలిపిన మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై విమర్శలు మానుకో.. లేకుంటే నీ నేరచరిత్రను ప్రింట్ తీసి మసీదులు, బస్టాండ్ వద్ద అతికిస్తాం' అని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఇమ్రాన్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇమ్రాన్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నాయకుడు సిరాజ్‌ఖాద్రీ గజదొంగ అని.. అతడిని ఆ పార్టీ నేతలు వెంబడించి తిరగడం విడ్డురంగా ఉందన్నారు. గతంలో చేసిన నేరాలను కప్పిపుచ్చుకునేందుకే కాంగ్రెస్ పార్టీలో చేరావని.. నీ స్థాయికి తగని మాటలతో విమర్శలు చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. దళిత కుటుంబాన్ని బెదిరించి 660 గజాలు, మైనార్టీ వక్ఫ్ భూములు కబ్జా చేశారని, చికెన్ వ్యర్థాల సేకరణలో అక్రమాలకు పాల్పడితే వ్యాపారస్తులు తిరగబడింది మర్చిపోయావా అంటూ మండిపడ్డారు. సిరాజ్‌ఖాద్రీ వంటివారిని పక్కన పెట్టుకొని చెడ్డ పేరు తెచ్చుకోవద్దని హితవు పలికారు. గత ప్రభుత్వంలో ఆగిపోయిన పనులను కొనసాగించాలని డిమాండ్ చేశారు. కేసులు పెడతామని బెదిరిస్తే భయపడేవారెవరూ లేరని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు సుల్తాన్, ఖదీర్‌పాషా, నయీం, మక్సూద్, ఫర్వాద్, అబ్దుల్లా, అమేర్ పాల్గొన్నారు.

గాంధీజీ మార్గాన్ని అనుసరించాలి

- రిటైర్డ్ డీఈవో విజయ్‌కుమార్



కోస్గిలో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న విజయ్‌కుమార్

కోస్గి, నవంబర్ 3 : గాంధీ చూపిన మార్గాన్ని ప్రతి ఒక్కరూ అనుసరించాలని, ముఖ్యంగా యువతను సన్మార్గంలో నడిపించాల్సిన బాధ్యత అందరిపై ఉందని విశ్రాంత ఉమ్మడి జిల్లా విద్యాధికారి శివార్చక విజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం సత్యశోధన పాదయాత్రలో భాగంగా కోస్గి మండల కేంద్రానికి చేరుకొని మహాత్మాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మట్లాడుతూ గాంధీ జయంతి రోజున అలంపూర్‌లోని జోగుళాంబ ఆలయం నుంచి ప్రారంభమైన సత్య శోధన పాదయాత్ర నేటికి 33 రోజులు అయిందన్నారు. ప్రస్తుతం యువత డ్రగ్స్, గంజాయి, మత్తు పదార్థాలకు అలవాటుపడి పెడదారిన పడుతున్నారని విద్యార్థులు, యువత ఆరోగ్యంగా ఉంటేనే దేశం బాగుంటుందన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కందూర్ శ్రీనివాస్, వినోద్, కిశోర్, చల్లా చందు, బీచ చంద్రప్రకాశ్, చల్లా శ్రావణ్, చల్లా సత్యనారాయణ, బీచ నాగేశ్వర్‌రావు, బీచ నరేందర్, బీచ సుభాష్, కటకం కృష్ణయ్య, పోలేపల్లి వెంకటేశం, విశ్వనాథం తదితరలు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి

నారాయణపేట, నవంబర్ 3 : రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని బీకేఎస్ రాష్ట్ర జోనల్ సెక్రటరీ వెంకోబా అన్నారు. ఆదివారం పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎస్ ఆధ్వర్యంలో పేట, దామరగిద్ద, మద్దూర్ మండలాలకు చెందిన పలువురు రైతులు దరఖాస్తులను ఎస్ఈ సంజీవరెడ్డికి అందజేశారు. అనంతరం వెంకోబా మాట్లాడుతూ పొలాల వద్ద లూజ్‌లైన్ ఉన్న చోట కర్రలు ఏర్పాటు చేసుకోవడం జరిగిందని ఆ ప్రాంతాల్లో కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలన్నారు. ఏబీ స్విచ్‌లు ఏర్పాటు చేయాలని, డీడీలు కట్టిన రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వాలన్నారు. దరఖాస్తు చేసుకున్న రైతులకు ట్రాన్స్ ఫోలాలు మంజూరు చేయాలన్నారు. పాడైపోయిన స్తంభాలు ఉన్నచోట నూతన స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతాంగ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎస్ జిల్లా కార్యదర్శి అనంతరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు బాలప్ప, సహాయ కార్యదర్శి ప్రభుమిస్కిన్, పట్టణాధ్యక్షుడు వెంకటప్ప, ఉపాధ్యక్షులు లక్ష్మీనారాయణ, విశ్వనాథ్‌రెడ్డి ఉన్నారు.

నారాయణపేట నుంచి శ్రీశైలం బస్సును ప్రారంభం

నారాయణపేట రూరల్, నవంబర్ 3 : నారాయణపేట డిపో నుంచి ప్రతి రోజు ప్రముఖ పుణ్య క్షేత్రం శ్రీశైలానికి డీలక్స్ బస్సును ఆదివారం ప్రారంభించినట్లు డీఎం లావణ్య తెలిపారు. ఈ బస్సును పేట మున్సిపల్ చైర్‌పర్సన్ గందెఅన సుశీల, మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, డీఎం లావణ్యలు జెండా ఊపి ప్రారంభించారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం పేట బస్టాండ్ నుంచి ఉదయం 8:20 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 3గంటలకు శ్రీశైలం చేరుతుందన్నారు. అలాగే శ్రీశైలం నుంచి మధ్యాహ్నం 3:30 గంటలకు నారాయణపేటకు బయలుదేరుతుందన్నారు. కార్తీకమాసం సందర్భంగా ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఆదేశాల మేరకు ఈ బస్సును ప్రారంభించామని, ప్రయాణికులు ఈ అవకాశం సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో హన్మంతు, కౌన్సిలర్ సలీం, చంద్రకాంత్, మాధవరెడ్డి, రఘువీర్‌యాదవ్, మారుతి, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరిది నిర్లక్ష్యం !

హన్వాడ, నవంబర్ 3 : మండలంలోని అత్యకుంట తండాకు చెందిన కుమార్, అనుష్య దంపతులకు 45రోజుల కిందట బాలుడు జన్మించాడు. శనివారం మధ్యాహ్నం బాలుడికి ఏఎన్ఎం, ఆశ కార్యకర్త ఇద్దరు కలిసి వారి ఇంటికి వెళ్లి బాలుడికి మూడు టీకాలు ఇచ్చారు. కాగా అదివారం తెల్లవారు జామున 3గంటలకు బాలుడు మృతి చెందాడు. బాలుడి శరీరం పచ్చబడగా టీకా ఇవ్వడంతోనే బాలుడు మృతి చెందాడని కుటుంబీకులు, తండావాసులు ఆరోపించారు. అధికారులు బంధితులకు న్యాయం చేయాలని తండావాసులు కోరారు. ఈ విషయంపై ఏఎన్ఎంను వివరణ కోరగా మేము టీకా ఇచ్చాము టీకా వల్ల ఎలాంటి ఇబ్బంది ఉండదు. వీరి తోపాటు మరి కొందరికి టీకా ఇచ్చామని సమాదానం ఇచ్చారు. అదేవిధంగా ఈ ఘటనపై ఎస్సై వెంకటేశ్‌ను వివరణ కోరగా ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

పశువుల దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు

దొంగల ముఠాను పట్టుకున్న పోలీసులు

దేవరకద్ర, నవంబర్ 3 : ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో పశువులను దొంగిలిస్తున్న ముఠాను పట్టుకున్నట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు, సీఐ రామకృష్ణ తెలిపారు. వీరి కథనం ప్రకారం బల్సుపల్లి శివారులో రైతు కట్టేసిన రెండు గేదెలు, రెండు దూడలను దొంగిలించారు. రైతు ఫిర్యాదు మేరకు పోలీసులు శనివారం దేవరకద్ర శివారులోని అమ్మాపూర్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా, రాయిచూర్ వెళ్తున్న బోలెరోలో 2 ఎద్దులను గుర్తించి వివరాలు అడిగారు. సరైన సమాధానం లేక పోవడంతో అదుపులోకి తీసుకొని విచారించారు. నందికొట్కూర్, కారుకొండ, కొల్లాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన దొంగల మూఠా సభ్యులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దేవరకద్ర, తాండూర్, కొల్లాపూర్, తిమ్మాజిపేట, జడ్చర్ల, కల్వకుర్తి, భూత్పూర్ తదితర ప్రాంతాల్లో 26 సార్లు దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. దేవరకద్ర మండలం బల్సుపల్లికి చెందిన రైతు గేదెలు, దూడలు రికవరీ చేసి బాధితుడికి అప్పగించామన్నారు. మిగతా పశువులను రికవరీ చేయనున్నట్లు వెల్లడించారు. నిందితులను పట్టుకున్న ఎస్సై నాగన్న, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

పోచమ్మ ఆలయంలో పూజలు

భూత్పూర్, నవంబర్ 3 : పట్టణంలోని పోచమ్మ ఆలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఆదివారం ఆలయానికి దర్వాజను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్ గ్రామస్తులతో కలిసి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అర్చకుడు మంజునాథ్, గ్రామస్తులు సుదర్శన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, రాములు, సురేశ్‌గౌడ్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూతో బాలుడి మృతి

జడ్చర్ల, నవంబర్ 3 : జడ్చర్ల మున్సిపాలిటీలోని రంగారావు తోటలో నివాసం ఉంటున్న శ్రీశైలం కుమారుడు సందీప్ (13) డెంగ్యూతో మృతి చెందినట్లు తెలిసింది. కొద్ది రోజులుగా జ్వరంతో బాధపడుతున్న బాలుడిని జడ్చర్లలోని దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయించినా జ్వరం తగ్గక పోవడంతో జిల్లా దవాఖానకు తీసుకెళ్లారు. అయినా జ్వరం తగ్గక పోవడంతో ప్రైవేట్ దవాఖానకు తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు తెలిసింది. డెంగ్యూ కేసు నమోదు కావడంతో కాలనీ పరిసర ప్రాంతాల్లో ఇంకా ఎవరికైనా జ్వరం ఉందా లేక ఇతర జబ్బులు ఎమైనా ఉన్నాయనే దానిపై డాక్టర్ మనుప్రియ ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు.

ఒలింపియాడ్ పరీక్షలో సత్తా

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, నవంబర్ 3: మహబూబ్‌నగర్‌లోని శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు క్యాట్ లెవెల్ వన్ ఒలింపియాడ్ పరీక్షలో సత్తాచాటారని ప్రిన్సిపాల్ మనోహర్ తెలిపారు. ఆదివారం పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో మాట్లాడారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. మొత్తం 155 మంది విద్యార్థులు సెలెక్ట్ అయ్యారని, విద్యార్థులకు సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అకాడమిక్ డీన్ యాదయ్య, ఐపీఎల్ ఇన్‌చార్జి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

జడ్చర్ల, నవంబర్ 3 : జడ్చర్ల మండల శివారులోని చిట్ట బోయిన్‌పల్లి గ్రామం వద్ద గల గురుకుల పాఠశాల సమీపంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. ఎస్సై చంద్రమోహన్ శనివారం మధ్యాహ్నం ముందు వెళ్తున్న వాహనాన్ని స్కూటీ ఢీకొన్న ఘటనలో ముడావత్ శంకర్(45) తీవ్రంగా గాయపడ్డాడని ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. వనపర్తి జిల్లా ఎర్రగుట్టతండాకు చెందిన శంకర్ హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నాడు. శంకర్ శనివారం పనిమీద తమ సొంతగ్రామానికి హైదరాబాద్ నుంచి తన స్కూటీపై బయలుదేరాడు. ఈ క్రమంలో జడ్చర్ల మండలం చిట్టబోయిన్‌పల్లి గ్రామం వద్ద గురుకుల పాఠశాల ఎదుట నేషనల్ హైవేపై వెళ్తున్న మినీ బస్సును నిలపడంతో దాని వెనుకాలే వస్తున్న స్కూటీ మినీ బస్సును బలంగా ఢీకొట్టింది. దీంతో స్కూటీపై ఉన్న శంకర్‌తోపాటు నర్సిములు గాయపడ్డారు. ఈ ప్రమాదంలో శంకర్‌కు చెవి, ముక్కునుంచి రక్తంవచ్చి తీవ్రగాయాలు కాగా మహబూబ్‌నగర్‌లోని జిల్లా దవాఖానకు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ శంకర్ శనివారం రాత్రి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి భార్య హేమి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. అదేవిధంగా చిట్ట బోయిన్‌పల్లి గ్రామ శివారులో 44వ జాతీయరహదారిపై ఆటోను కారు ఢీకొన్న ఘటనలో శాంతయ్య(48) మృతి చెందగా చంద్రమ్మకు గాయాలైన్నట్లు జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి తెలిపారు. మహబూబ్‌నగర్ మండలం దివిటిపల్లికి చెందిన భార్య భర్తలు ఆటోలో దివిటిపల్లి నుంచి జడ్చర్లకు ఆటోలో వస్తుండగా బెంగళూరు నుంచి హైదరాబాద్‌వైపు వెళ్తున్న కారు వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న డ్రైవర్ శాంతయ్య అక్కడికక్కడే మృతి చెందగా చంద్రమ్మకు తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం చంద్రమ్మను జడ్చర్ల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ సమీపంలోని ఎస్వీఎస్ దవాఖానకు తరలించారు.

జర్నలిస్ట్ కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

గండీడ్, నవంబర్ 3 : మండలంలో వర్కింగ్ జర్నలిస్ట్ ఆంజనేయులు తల్లి బంటు శివమ్మ ఆకస్మికంగా మృతి చెందడంతో ఆదివారం పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ సాలార్‌నగర్ గ్రామానికి చేరుకొని ఆంజనేయులును పరామర్శించి శివమ్మకు శ్రద్ధాంజలి ఘటించారు. ఆయన వెంట రైతు సమన్వయ సమితి మండలాధ్యక్షుడు గోపాల్, మాజీ వైస్ ఎంపీపీ ఈశ్వరయ్య గౌడ్, రిటైర్డ్ ఉపాధ్యాయులు నర్సప్ప, సాయిలు, కాశీనాథ్‌రెడ్డి, వెంకటయ్యరెడ్డి, రాములు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల కమిటీ ఎన్నిక

హన్వాడ, నవంబర్ 3 : హన్వాడ మండల పీఆర్టీయూ మండల కమిటీని అదివారం జిల్లా కేంద్రంలో ఎన్నుకోవడం జరిగింది. పీఆర్టీయూ మండలాధ్యక్షుడిగా స్వామి, ప్రధాన కార్యదర్శి విజయనంద్‌రెడ్డిల తోపాటు మరో పది మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ మండలంలో సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్, సుధాకర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం మహాసభను విజయవంతం చేయాలి

హన్వాడ, నవంబర్ 3 : ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలో నిర్వహించే సీపీఎం మహాసభను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి లక్ష్మయ్య అన్నారు. అదివారం మండల కేంద్రంలో సీపీఎం మహాసభ సంబంధిత వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే రాబోయే రోజుల్లో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈనెల8న జడ్చర్లలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, చుక్కయ్య, శ్రీకాంత్ ఉన్నారు.

కాస్మోటిక్ చార్జీల పెంపుపై హర్షం